# తీరుబడి

"నన్ను మీరు క్షమించేయాలండీ—ఏమిటో ఈమధ్య బొత్తిగా తీరుబడి ఉండడం లేదు" అనేశాడు శంకరం.

నవ్వాలో ఏడవాలో తెలియలేదు నాకు.

తీరుబడికి మారుపేరు మా కాలనీ. సమాన హక్కులకోసం ప్రపంచంలోని ఆడవాళ్ళందరూ వుమెన్స్‌లిబ్ జరుపుతున్న ఈ రోజుల్లో భార్యకు వంటపనుల్లో అన్నివిధాలా సాయం చేశాకగానీ—లేదా వంటచేయడం తామే పూర్తి చేసిగానీ ఆఫీసుకు వెడతారు మా కాలనీలో వున్న భర్తలందరూ. అలాగని ఆ భర్తలందరూ ఏదో కష్టపడిపోతున్నారని అనుకోనవసరం లేదు. ఉదయం తొమ్మిదికల్లా టిఫిన్ తినేసి ఆఫీసుకివెళ్ళి పన్నెండున్నరవరకూ చేతిగోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటారు. ఆ తర్వాత ఇంటికివచ్చి భోజనంచేసి ఒంటిగంటన్నరకల్లా మళ్ళీ ఆఫీసుచేరి నాలుగున్నరవరకూ కాలిగోళ్ళు గిల్లడం చేస్తారు. ఎక్కువగా కట్‌చేస్తే జుట్టు చాలా త్వరగా ఎదుగుతుందంటారు. వాళ్ళ గోళ్ళు కూడా రోజుకొకసారి ఎదిగిపోయి బాగా కాలక్షేపాన్ని ప్రదర్శించడానికవకాశమిస్తూంటాయి. రోజురోజుకీ గోళ్ళెదిగిపోవడంవల్ల ఎప్పుడైనా సెలవురోజు గోళ్ళుగిల్లుకునేందుకు వీలుపడక పోతే చాలా ఇబ్బంది పడుతూంటారు వాళ్ళు.

వసుంధర

వాళ్ళకి బొత్తిగా వ్యాయామంలేకుండా పోయిందని ఇంట్లో ఆడవాళ్ళు—కనీసం ఇంట్లోవున్నప్పుడేనా పనిచేయండని వంటపనులు అంటగడుతుంటారు. ఎందుకంటే రెండునిముషాలు నడకదూరంలోవున్న ఆఫీసుకు వెళ్ళడానికి వాళ్లు సైకిళ్ళు, స్కూటర్లు, కార్లు వగయిరా వాహనాలు వాడతారు. వాహనాలు లేనివాళ్ళు, వాహనాలున్నవాళ్ళిచ్చే లిఫ్టుకోసం ఆఫీసుకు కాస్త ఆలస్యమయినా ఇబ్బంది లేదనుకుంటారు.

వాళ్ళ సంగతలాగుంటే ఆడవాళ్ళ సంగతి మరీఘోరం. భర్త వీధిగుమ్మం దాటగానే వీరు వీధిగుమ్మంలోకి వస్తారు. ప్రతి ఒక్కరు వారివారి ఇళ్ళలో పొజిషన్ను చూసుకుని కాస్త హెచ్చు స్వరంతో ఉపన్యాసాలవంటి కబుర్లు మొదలెడతారు. ఎవరు మొదలుపెడితే వాళ్ళు ఆగరు. ఆగితే రెండవ వాళ్లు మొదలు పెట్టేస్తారనీ—మళ్ళీ తమకు చాన్సురాదనీ భయం. అయినా ఎప్పుడో అప్పుడు ఊపిరిపీల్చుకోవడానికయినా ఆగక తప్పదు కదా! అప్పుడు మ్యూజికల్ చెయిర్స్‌లోలాగా ఎవరు అప్రమత్తతగావుంటే వారికి మాట్లాడే అవకాశం వస్తుంది. వీళ్ళలో ఎవరూకూడా ఒకరు చెప్పేదింకొకరు వినరు. మాట్లాడేమనిషి ఎప్పుడాగుతుందా అప్పుడు తాము మాట్లాడుతామా అని ఎదురు చూస్తూంటారు. అలా వారు అనర్గళంగా గంటలకొద్దీ మాటాడేసుకుంటూంటారు—ఎవరయినా అడ్డుపడేవరకూ.

మాటల వ్యాయామం తప్పితే చేతలవ్యాయామం ఆడవారికి చాలా తక్కువే! వంట విష


యంలో భర్త సాయం చేస్తాడు. గిన్నెలు పని మనిషి తోముతుంది. పనిమనిషి లేనివారు గిన్నెలు భర్త ఉన్న సమయంలోనే తోము కుంటారు. భార్యాభర్తల్లో ఎవరు గిన్నెలుతోము తారన్నది బహిరంగ రహస్యం.

ఈ కారణాలవల్ల మా కాలనీలో ఆడా,మగా అందరూ ఎంతో పుష్టిగావుంటారు. పిల్లలు మాత్రం అంత పుష్టిగావుండరు. ఎందుకంటే తలిదండ్రులకు వీరిని పట్టించుకునేటందుకు తీరు బడి కావాలికదా!

ఇంతకీ ఇపుడు శంకరంగారి తీరుబడి ప్రసక్తితో ఈ వివరాలన్నీ చెప్పాల్సివచ్చింది.

ఎవరికీ సరయిన పనిలేకపోవడం వల్లనేమో మా కాలనీలో అందరికీ ఒక విధమైన బద్ధకం ఏర్పడిపోయింది. కొంతమందికి ఇల్లు కదిలి పొరుగింటికి వెళ్ళాలంటేనే బద్ధకం. సినిమాకి వెళ్ళాలంటే దాన్నో పెద్ద ప్రయాణంగా భావించి వదిలేసేవారు మా కాలనీలో చాలామందున్నారు. అందులో కొంత నిజం కూడా లేక పోలేదు లెండి.

ఈ పరిస్థితిలో తెలుగువారికి తెలుగు మరచి పోకుంటా అభ్యాసంగా వుంటుందని ఇంకో రకం పనిలేని వాళ్ళం కొందరం కలసి ఓ లిఖిత తెలుగు పత్రిక పెట్టేము. ఆ పత్రికకు రచనలు కావాలి కదా!



పత్రిక కాలనీ జీవితానికి ప్రతిబింబంగా వుండాలని మా ఆశయం. అందుకని మా కాలనీలో తెలుగు తెలిసిన ప్రతి ఒక్కరినీ రచన లడగడం ప్రారంభించాము. అప్పుడే మాకు తెలిసింది—కాలనీలో చాలామంది తెలుగువారికి తీరుబడి ఏ మాత్రమూ లేదని. ఎలాగో నానా అవస్థలూపడి రెండు పత్రికలు వెలుగులోనికి తీసుకువచ్చాం. వాటిని చదివి ఒక్కొక్కరినే అభిప్రాయాలీయవలసిందిగా కోరాము. ఆ అభిప్రాయాలతో కొన్ని పేజీలు నింపవచ్చునని మా ఆశ.

అయితే పత్రిక చదవడానికే తీరుబడి దొరక లేదని శంకరం అనడంతో నాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

“ఆశ్చర్యంగా ఉందే” అన్నాను ఒళ్లమంటకు ఆశ్చర్యం అన్న పేరుపెట్టి.

“అవునండీ — నేను తీరుబడిలేక పేపరు చదవడం మానేశాను. రేడియో వినడం మానేశాను—”

“ఏమిటి కారణం?”

“మా అబ్బాయండీ. ఒక్క క్షణంకూడా వాణ్ని చంక దించడానికి వీలులేదు.”

“పోనీలెండి. ఆఫీసుకయినా రానిస్తున్నాడు. అదయినా నయం....” అన్నాను వ్యంగ్యాన్ని కడుపులో దాచుకునేందుకు ప్రయత్నిస్తూ.

“అబ్బే—వాడిగురించి ఇంతవరకూ మూడు క్యాజువల్ లీవులు వృధా అయిపోయాయి. ఆ

మధ్య ఓ నాలుగురోజులు ఎర్న్డ్ లీవు కూడా పెట్టేను."

"ఇంక పడీ లీవొక్క-టే తతవాయి" అనుకున్నాను మనసులో.

శంకరం నావంకచూసి "నేను చాలా బాధ పడుతున్నానండీ. వెధవది పుస్తకం చదవటం ఎంతసేపండీ—పావుగంట. ఆ మాత్రం తీరుబడి యెలా చేజిక్కించుకోవాలో ఏదయినా ఉపాయం చెబుదురూ...." అన్నాడు.

"నిజంగా మీకు ఉపాయం కావాలా?"

"నిజమండీ—తెలిస్తే చెప్పండి...."

"చెబుతాను కానీ మీరేమీ అనుకోకూడదు"

"బాగుందండీ — ఉపాయం చెబాతూంటే ఏమైనా అనుకోవడమెందుకు?"

క్షణం మాత్రమే తటపటాయించాను. "ఆ మధ్య ఓ వారంరోజులు మీ పాలవాడు పాలు పొయ్యకపోతే ఏం చేశారు మీరు?"

శంకరానికి నాప్రశ్న వెనుక ఉన్న భావం అర్థమైనట్లులేదు. సూటిగానే జవాబుచెప్పాడు. "సైకిల్‌మీద టౌన్‌వెళ్ళి మిల్క్‌బూత్‌నుంచి తీసుకువచ్చాను."

"అందుకెంత టైమ్ పట్టేది?"

"సుమారు ముప్పావుగంట . ."

"అంతసేపూ మీ బాబుని మీ శ్రీమతిగారే భరించారుకదా. .."

"అయితే?"

"మరోరోజు మీ పాలవాడు పాలుపోసినా పోయలేదనుకోండి. అలా అనుకోవడంద్వారా రోజుకు ముప్పావుగంట చొప్పున మీకు తీరుబడి దొరుకుతుంది" అన్నాను.

ట్రాప్‌లో పడిపోయాననుకున్న శంకరానికి చిన్న డిఫెన్స్ దొరికింది. "మావాడు నేనుంటే మా శ్రీమతి దగ్గరుండడండీ—నాన్న, నాన్న అంటూ మీద పడిపోతాడు. ఇంట్లో లేనపుడు అది వేరే సంగతి!"

"దానికీ వుపాయముంది" అన్నాను నేను.

"ఏమిటది?" అన్నాడు శంకరం ఈసారి ఇబ్బందిగా.

"ఏమీలేదు. ఆ మధ్య ఓ శనివారంనాడు మీ ఇంట్లో పేకాటకేర్పాటు జరిగింది. ఆఆట నాలుగయిదు గంటలు కొనసాగిందేమో!"

"అవును.. "

"అంటే మీరింట్లోవున్నా మీ బాబు మీ శ్రీమతి దగ్గరుండే అవకాశాలున్నాయి.ఎటొచ్చీ మీరు పేకాడుతున్నానని అనుకోవాలి. అలా వారాని కొక్కసారి చేసినా చాలు నాలుగు గంటలు తీరుబడి దొరుకుతుంది మీకు."

శంకరం నవ్వేసి—"నన్ను మన్నించాలి. రేపే మీకు పుస్తకాలూ, వాటితోపాటు నా అభిప్రాయాలు పంపించేస్తాను" అన్నాడు.

"ఏమీ అనుకోలేదుగదా మీరు. .." అనుమానంగా అడిగాను.

"బాగుందండీ—మీ ఉద్దేశ్యం నన్ను నొప్పించడం కాదుగా—ఒప్పించడమే" అంటూ మనస్ఫూర్తిగా నవ్వాడు శంకరం.

ఇది మా కాలనీలోని ప్రత్యేక విశేషం. ఎవరికీ యెవరిమీదా అనుమానాలూ, ద్వేషాలూ లేవు. వాదనలో ఓడిపోయినపుడు ముఖం ఎర్రగా చేసుకోడానికి బదులు—నవ్వేసి—"నన్నొదిలేయాలండీ"అనడం ఇక్కడి రివాజు.

ఆ తర్వాత నేనక్కణ్నించి సుజాత గారింటికి వెళ్ళాను. ఆ సమయానికి వాళ్ళింట్లో గెస్టులున్నారు. వాళ్ళతో పాటే నేనూ కూర్చున్నాను. సుమారు గంట అనంతరం గెస్టులు వెళ్ళారు.

"చూశారుగా — యిదీ వరుస...." అంది సుజాత.

"అయితే యింకా రాయలేదా?" అన్నాను నీరసంగా.

"ఏం రాయనండీ—గెస్టులమీద గెస్టులు" అంది సుజాత.

"అవునండీ—తీరుబడి దొరకడంలేదు—"




అని సుజాత భర్త కూడా భార్యకు వంత పాడాడు.

మా మూడవ సంచికకు సుజాతగారి రచన అడిగాము. ఆవిడ అనర్గళంగా, ధారాళంగా వగయిరా, వగయిరాగా మాటాడగలగటమే కాక—తన మాటలతో శ్రోతలకేమాత్రమూ విసుగును కలగనివ్వక పోవడం నన్నాకర్షించిన విశేషం. అంతబాగా ఆగకుండా మాటాడ గలిగిన మనిషికి మంచి కల్పనాశక్తి వుండితీరు తుందనే అభిప్రాయంతో నేను ఆవిడను ఒక రచనచేసి ఇవ్వమని కోరాను. "అనుభవం లేదండీ" అందావిడ.

"మీ ఎదురుగా ఎవరయినా ఉన్నారనుకొని వారితో మాటాడుతున్నాననుకోండి. ఏం తోస్తే అది రాసేయండి'' అన్నాన్నేను. అతికష్టం మీద ఆవిడ అంగీకరించింది. అంగీరింప చేయడం ఒకఎత్తు—రచన సంపాదించడం ఇంకో ఎత్తు అనిపిస్తోందిపుడు పరిస్థితి చూస్తూ వుంటే.

సుజాతతో వాదించడం కష్టం. ఆవిడకు ముందుగానే అభిప్రాయాలు కొన్ని యేర్పడి వుంటాయి. వాటినికాదని మనం వాదన మొదలు పెట్టేమా ఆవిడ బుర్రలోకి ఇంకేమీ ఎక్కవు. మనం చెప్పేదేమీ ఆవిడ వినదు. మనంపూర్తి చేసేదాకా మాత్రం ఆగి తను అనుకున్న దే విధంగా సరియైనదో వివరించడానికి ప్రయత్ని స్తుంది. అందుచేతనే మనపని జరగాలంటే వాదన విధానం మార్చాలి.

అయినా మొదటి ప్రయత్నంగా "తొమ్మిది గంటలనుండి పన్నెండున్నర వరకూ మళ్ళీ ఒంటిగంటన్నర నుండి నాలుగువరకూ మీరు ఇంట్లో తలుపులు వేసుకొని కూర్చోండి. కేవలం ఒక్కరోజే. .." అన్నాను.

"అబ్బే—అదేం కుదరదండీ—ఇరుగావిడో పొరుగావిడో వచ్చి తలుపు తట్టేస్తారు...." అనేసిందావిడ.

ఆ మాటల్లో అబద్ధంలేదు కానీ అదంత పెద్ద సమస్యకాదు. తను ముఖ్యమైన పనిలో ఉన్నానని చెపితే వాళ్ళు వెళ్ళిపోతారు. అలా చెప్పి పంపడం ఆవిడ కిష్టముండదు. వచ్చిన ప్రతి వారితోనూ పావు గంటయినా కబుర్లు చెబితే కాని ఆవిడకు తోచదు. అంతేకాదు—ఆవిడ నిజంగానే ముఖ్యమైన పనిలో ఉన్నా ఇరుగమ్మో పొరుగమ్మో వచ్చి తలుపు తట్టాలని

ఆవిడ కుంటుంది. అలా జరక్కపోతే తనకీ తన ఇంటికీ చిన్నతనంగా ఆవిడ భావిస్తుంది.

ఇవి సుమారు ముప్ఫై ఏళ్ళుగా ఒక మనిషిలో పేరుకుపోయినా భావాలు. వాటిలోని మంచి చెడ్డలను నిర్ణయించే అర్హత నాకులేదు. తప్పొప్పుల నెన్నడం నాకు తగని పని—నాకు తగిన పని కార్యసాధన.

"ఇంకే ఉపాయమూలేదా?" అన్నాడు సుజాత భర్త నన్నే చెప్పమన్నట్లు.

"ఉంది. అందుకు మీ సహకారం కావాలి .. " అన్నాను.

"చెప్పండి. ఆయన సహకారం తప్పక ఉంటుంది..." అంది సుజాత భర్త తరఫున హామీ ఇస్తూ.

"ఏమీలేదు, ఆఫీసుకు సెలవులేని రోజున ఏదైనా పూజవస్తే ఏంచేస్తారు మీరు?"అన్నాను.

"ఏముంది—కాస్త పెందరాళే లేస్తాను. ఆయన పిల్లల్ని, పై పనులా చూసుకుంటారు. నేను వంట, పూజ చూసుకుంటాను. సులభంగా తెమిలిపోగలం...." అందావిడ.

"పూజకే మాత్రం సమయం కావాలి—?"

"ఓ గంటకు పైగా—."

"సరే—అయితే ఓ నాలుగు రోజులపాటు పూజ ఉందనుకోండి. నాలుగు గంటల తీరుబడి వస్తుంది. . " అన్నానేను.

ఆవిడ రచన ఇస్తానని వాగ్దానం చేసేక నేను ప్రతాప్ దగ్గరకు బయల్దేరాను.

ప్రతాప్ అదోక రకం మనిషి. అతనికి చాలా చాలా చేయాలని ఉంటుంది. కానీ అతనిలో కొంత ఇనర్షియా ఉంది. ఆ పైన ఎదుటి వాళ్ళ ప్రభావానికి లొంగిపోయే మనస్తత్వం ఉంది. ఎప్పుడైనా అతను ఇనర్షియాను అధిగమిస్తే—ఎదుటి వాళ్ళొచ్చి లొంగదీసేసుకుని అతని దారిని మళ్ళించడం జరుగుతూంటుంది.

అలా నా ప్రభావానికి లొంగిపోయి అతను నాకో మాటిచ్చాడు. మా కాలనీకి దగ్గర్లో ఒక పముఖ రచయిత్రి వుంది. ఆవిడ తెలుగుది కావడం వల్లకానీ-లేకపోతే మా కాలనీ తెలుగు వారందరూ ఈ పాటికి పిలిచి సన్మానించ వలసినంత పేరున్న దావిడకు. ప్రతాప్‌కి ఆవిడతో కొంత పరిచయముంది. అతను ఆవిడ నడిగి మా పత్రికకు కొన్ని రచనలు (కనీసం ఒకటైనా) సంపాదిస్తానన్నాడు పనిలో పనిగా మా పత్రికలను సమీక్షించ వలసిందని కూడా ఆవిడను కోరమని ప్రతాప్‌కి చెప్పాను. అప్పటికి సుమారు నెల రోజులుగా ప్రతాప్ ఈ విషయాన్ని వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఏమిటంటే ఎవరో పేకాటకు ఆపేశారన్నాడు. మరో రోజు ఎవరో సినిమాకు తీసుకుపోయే రన్నాడు. ఇంకో రోజు మర్చిపోయానన్నాడు. ప్రతిసారీ ఏదో కారణం కొత్తదో పాతదో వస్తోంది తప్పితే పని జరగడంలేదు. గట్టిగా అడగడానికి ఇదేమీ అతని స్వంత బాధ్యతకాదు కదా! అప్పటికీ ఒకరోజున అతన్ని మా ఇంటికి భోజనానికి పిలిచాను. మా ఇంటినుంచి తీసుకువెళ్ళి ఆ రచయిత్రి ఇంటి దగ్గర దిగబెట్టవచ్చునన్న ఉద్దేశ్యంతో. అయితే అతనారోజు మా ఇంటికి రాలేదు. మర్నాడు చెప్పాడు. వద్దామనే బయల్దేరాడట—ఎవరో అతన్ని ఈలోగా టౌన్ తీసుకెళ్ళి పోయారట. ఇంతకంటె ఎక్కువగా అతని గురించి ఏమీ చెప్పనవసరం లేదనుకుంటాను.

నిన్నటి రోజున తప్పక వెడతానని మాటిచ్చేడు. ఎందుకంటే ఆఫీసుకు వరుసగా మూడు రోజులు సెలవు లొచ్చాయి. అందుకే నేనీ రోజు అతని గదికి బయల్దేరాను.

నేను వెళ్ళేసరికి గదిలో జోరుగా పేకాట సాగిపోతోంది. నన్నుచూచి ప్రతాప్ నవ్వి— "సారీ గురూజీ—నే నింకా వెళ్ళలేదు. నిన్నటి నుంచి ఆగకుండా పేకాట కొనసాగిపోతోంది. మధ్యలో రెండుసార్లు టిఫెనూ-ఒకసారి భోజ




నమూ-అయిదుసార్లు కాఫీలూ—నాలుగ్గంటలు నిద్రా మాత్రం అయ్యాయి—" అన్నాడు.

"అనుకున్నాన్లెండి కానీ—ఇంక లేవండి." అన్నాను నెమ్మదిగా. ఎందుకంటే ఇంకలాభం లేదు—నేను స్వయంగా అతన్ని కదిలిస్తే తప్ప పని జరగదు.

ప్రతాప్ లేవగానే అతని స్థానంలో అంత వరకూ ఛాన్స్‌కోసం ఎదురుచూస్తున్న ప్రసాద్ కూర్చున్నాడు. ప్రసాద్ కూర్చోగానే - ప్రతాప్ బట్టలు మార్చుకుంటూ—"మంచి రైజ్‌లో ఉన్నపు డొచ్చారు గురూజీ—చోటు మంచిది. లక్కీ ఛాన్స్‌కొట్టావ్..." అన్నాడు.

దారిలో—"ఏం చేయను గురూజీ—తీరుబడి ఎలా సంపాదించాలో తెలియడంలేదు—" అన్నాడు ప్రతాప్.

ప్రతాప్ దగ్గర నా క్కాస్త చనువుంది—"చూడండి ప్రతాప్—తీరుబడి అనేది బజార్లో దొరికే వస్తువు కాదు. భగవంతుడిలా అది కనిపించకుండా మన దగ్గరే ఉంటుంది. గుళ్లోని రాతి విగ్రహం ఉలకదు, పలకదు. కానీ దాన్ని చూసి మనం భయపడుతున్నాం. దాన్ని మనం కోరికలు కోరుతున్నాం. దానికి మనం దేవుడని పేరు పెట్టాం. అది దేవుడు కాదని మనకందరికీ తెలుసు. మనకు తెలిసిన ప్రతి కథా రాతి విగ్రహంలోనే దేవుడు లేడనీ—దేవుడు సర్వాంతర్యామి అనీ చెబుతుంది. అలాగే తీరుబడి విషయం కూడా. మనకే ప్రయోజనమూ లేదనుకున్న పనిని వదుల్చుకునేందుకూ, మన కిష్టంలేని పనిచేయకుండా ఉండడానికీ మనం చెప్పే కారణం పేరును "తీరుబడిలేదు. " అంటారు తప్పితే తీరుబడి సర్వత్రా వ్యాపించి ఉంది. రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేసే జవహర్లాల్ నెహ్రూ—పదవీ కాలంలోనే ఎన్నో గ్రంథాలు రచించాడు—" అన్నాను.

మరి నా తీరుబడి సంగతేమిటని అందరూ అడగవచ్చు. మేము పెట్టిన ఈ లిఖిత పత్రిక ఆగిపోయే దాకా నాకు తీరుబడి ఉన్నట్లే లెక్క మరి! □